ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025

5

పార్వతీపురం మన్యం

పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలి

పార్వతీపురం : ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన గ్రాంట్లకు సంబంధించి ఈనెల 22,23 తేదీల్లో నిర్వహించనున్న ఆడిట్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. మంగళవారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ఎస్ఎస్ఎ ఎపిసిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు మంజూరైన గ్రాంట్లకు సంబంధించి ఈనెల 22,23 తేదీల్లో నిర్వహించనున్న ఆడిట్‌కు సిద్ధం కావాలని ప్రధానోపాధ్యాయులను సర్వశిక్షా అభియాన్ అధికారులు కోరారని చెప్పారు. అయితే పాఠశాలలకు సెలవులు ఇచ్చినందున, ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఆడిట్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారు.

ఘనంగా శ్యామలాంబ పండగ

- పోటెత్తిన జనం
- ఆకట్టుకున్న తప్పెటగుళ్ళు, పులి వేషాలు
- అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో శ్యామలాంబ పండగ ఘనంగా జరిగింది. పండగలో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జన్నివాడ ధనుంజయరావు సిరిమాను రథంపై ఆశీనుడైన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రథాన్ని లాగి ప్రారంబించారు. అల్లువీధి నుంచి ప్రారంభమైన సిరిమాను రథం శివాజీ జంక్షన్, బోస్ బొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డు, వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్, కోటవీధి, పెదకోమటి పేట, డబ్బివీధి మీదుగా ఆలయం వద్ద కు చేరింది. ఈ ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పులి వేషాలు, తప్పిటగుళ్లు ఆకట్టుకున్నాయి. సిరిమానోత్సవాన్ని చూడ్డానికి వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. డిఎస్పీ రాంబాబు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

దర్శించుకున్న జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్

శ్యామలాంబ పండుగ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సతీసమేతంగా వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆలయం వద్ద ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని వారు చెప్పగా, వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సామాజిక సేవలో ముస్లిములు

శ్యామలాంబ పండుగ నేపథ్యంలో గడిచిన మూడు రోజులు గా జమా మసీదు ముస్లిం సంఘం ఆధ్వర్యాన వేగావతి వంతెన సమీపంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు.ఎండలు తీవ్రంగా ఉండడంతో భక్తుల దాహార్తిని తీర్చారు.

వీధుల్లో తిరుగుతున్న సిరిమాను

చక్రం ఇరుసు విరిగిపోవడంతో ఆగిన సిరిమాను

సిరిమానోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది.అక్కేన వీధి రామమందిరం నుంచి ప్రారంభమైన సిరిమాను రథోత్సవం బోస్ బొమ్మ జంక్షన్‌కు చేరడానికి ముందే ఆగిపోయింది. సాలూరు రూరల్ సిఐ కార్యాలయం ఎదురుగా అంజలి రథం చక్రం విరిగిపోవడంతో సిరిమాను రథాన్ని అక్కడే నిలిపివేశారు. కొత్త చక్రం తెప్పించి అమర్చిన తర్వాత సిరిమానోత్సవం తిరిగి ప్రారంభించారు. ముహూర్తం ప్రకారం సిరిమానోత్సవం సాయంత్రం 4.05 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే గంటన్నర ఆలస్యంగా ప్రారంభం కావడంతో చీకటి ఆవహించింది. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో కాకుండా పట్టణమంతా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారంలో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అంజలి రథం కొత్త చక్రం తీసుకొచ్చి అమర్చడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సిరిమానోత్సవం తెల్లవారుజాము వరకు కొనసాగే అవకాశం ఉంది. అంజలిరథం చక్రం విరిగిపోవడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పండగలోనూ కరెంటు కోతే

- ఉక్కపోతలతో జనం బెంబేలు
- ఆందోళనకు దిగిన ప్రజలు
- చేతులెత్తేసిన విద్యుత్ శాఖ అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండుగలోనూ విద్యుత్ కోతలను పట్టణ ప్రజలు ఎదుర్కొన్నారు. తరచూ కోతలు విధించడంతో పట్టణ వాసులు నానా అవస్థలు పడ్డారు. శ్యామలాంబ పండగ సందర్భంగా ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూసేందుకు స్థానిక మంత్రి సంధ్యారాణి రూ.2కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో 100 కెవి ట్రాన్స్ ఫార్మర్స్ ఆరు, 63 కెవి నుంచి 100 కెవి అప్డేటెడ్ ట్రాన్స్ ఫార్మార్లు ఏడు, 160 కెవి ట్రాన్స్ ఫార్మర్లు రెండు పట్టణంలో ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మార్ల ఏర్పాటుతో విద్యుత్ కోతలు ఉండవని మంత్రి సంధ్యారాణి చెప్పడంతో పట్టణ ప్రజలు గట్టిగా నమ్మారు. అయితే గత మూడు రోజులుగా పట్టణ ప్రజలు చెప్పుకోలేని రీతిలో విద్యుత్ కోతలు ఎదుర్కొన్నారు. 24 గంటల్లో 12 గంటలు కూడా విద్యుత్ సరఫరా లేని పరిస్థితి కనిపించింది. సోమవారం సాయంత్రం తొలేళ్ల ఉత్సవం జరిగిన తర్వాత రాత్రంతా విద్యుత్ సరఫరా లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంట్లో ఈగల మోత వీధిలో పల్లకి మోత చందంగా పట్టణమంతా రంగురంగుల విద్యుత్ దీపాలు వెలిగించారు. కానీ ఇళ్లల్లో మాత్రం విద్యుత్ సరఫరా లేని పరిస్థితి ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయమంతా డబ్బివీధి, రామా కాలనీ, చిన కుమ్మరి వీధి, బంగారమ్మ కాలనీల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం అల్లాడిపోయారు. పండగకు వేలాదిమంది భక్తులు రావడంతో వారు ఇళ్లల్లో ఉండలేక, బయట తిరగలేక అవస్థలు పడ్డారు. మంగళవారం శ్యామలాంబ ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పట్టణంలో విద్యుత్ కోతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంగళ వారం సిరిమానోత్సవం సందర్భంగా సిరిమాను తిరిగే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వుండదని విద్యుత్ అధికారులు చెప్పారు. సిరిమాను ఊరేగింపు పూర్తయిన తర్వాత కూడా విద్యుత్ సరఫరా ఉంటుందా లేదా అని జనం బెంబేలెత్తుతున్నారు. పండుగ సందర్భంగా పట్టణంలో విద్యుత్ వినియోగం పెరిగింది. ఇళ్లల్లో ఎయిర్ కండీషనర్ల వాడకం పెరగడం, ప్రధాన వీధుల్లో, రోడ్డులో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయడంతో ఓవర్ లోడ్ కారణంగా ఇళ్లకు సరఫరా లో అంతరాయం ఏర్పడింది. ప్రజలను సంతృప్తి పరిచే స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు విఫలమ య్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. 15 ఏళ్ల క్రితం జరిగిన శ్యామలాంబ పండుగ సమయంలో విద్యుత్ కోతలు ఎక్కువ కావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకోనైనా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెయిన్‌రోడ్డుపై నిరసన తెలుపుతున్న గొట్టాపువీధి వాసులు

కోతలకు నిరసనగా మహిళల ధర్నా

విద్యుత్ కోతలకు నిరసనగా పట్టణ ప్రజలు చినబజార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. అలాగే గొట్టాపువీధికి చెందిన మహిళలు, వ్యక్తులు రోడ్డు మీద కొచ్చి మెయిన్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఉదయం నుంచి ఇళ్లకు విద్యుత్ సరఫరా లేదని, గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న టౌన్ సిఐ అప్పలనాయుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. సిరిమానోత్సవం తర్వాత కోతల్లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.

ట్రాన్స్ ఫార్మర్స్ కాలిపోవడంతో అంతరాయం: విద్యుత్ ఎస్ఇ చలపతిరావు

సోమవారం రాత్రి పట్టణంలో రెండు ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒక 40కెవి, ఒక 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. మరమ్మతులు చేశాం. ఎసిలు, గ్రైండర్ల వినియోగం పెరగడంతో ఓవర్ లోడ్ కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది.

అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు

విరిగిపోయిన అంజలి రథం

ఆకట్టుకుంటున్న వివిధ రకాల వేషధారణలు, కళారూపాలు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీని ప్రతి ఒక్క ఇంటికి తీసుకెళ్లేలా రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే కాలంలో కూడా ప్రతి ఎన్నికల్లో టిడిపిని ప్రతి ఇంటికి తీసుకువెళ్లి గెలుపు దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని, కార్యక్రమాన్ని ఇంటి ఇంటికి తీసుకువెళ్లి ప్రజలకు కార్యక్రమాలను వివరించాలని సూచించారు. అలాగే సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని, అలాగే పార్టీకి ప్రతి ఒక్కరూ విధేయత ప్రదర్శించాలని కోరారు. పార్టీ గ్రామ, మండల కమిటీలను నియమించుకొని కడపలో జరిగే మహానాడుకు హాజరై ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ, పాచిపెంట, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాలరావు, ముఖీ సూర్యనారాయణ, చలుమూరి వెంకట్రావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వర్షాల పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల జారీ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. ఆ సమయంలో ప్రజలు ఆరుబయట తిరగరాదని, పిడుగులు పడే సమయంలో దగ్గరలో గల సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని తెలిపారు. వాతావరణంలో మార్పులపై రాష్ట్ర విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫోన్ ద్వారా కూడా అందిస్తుందని, వాటి ఆధారంగా ప్రజలు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.

జీవనోపాధి కల్పనకు తోడ్పాటు

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రామాల్లో జీవనోపాధి కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించేలా తోడ్పాటు అందించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోండలంలోని చీపుర్ల వలసలో పి ఎం జన్ మన్ గృహనిర్మాణాలు, గోగాడ వలస లోని ఉద్యాన పంటలు, కోటికి పెంటలో ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ స్థల పరిశీలన, పూడి నుంచి కేరంగి వరకు నిర్మించిన రహదారిని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.. ఈ సందర్భంగా గృహ నిర్మానాల జాప్యం కారణాలను లబ్ధిదారులకు కలెక్టర్ ప్రశ్నించగా ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల కొంత ఆలస్యమైందని చెప్పగా, తెలిపారు. మహిళా సంఘాల ద్వారా మేకలు, గొర్రెలు, పెరట కోళ పెంపకం ఆదాయ మార్గాలు పెంచుకోవాలని సూచించారు. ఇళ్లు కావాల్సిన షెడ్యూల్ తెగలకు పీ ఎం జుగా లో ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఆరోగ్య కార్డులలోని రక్త స్థాయిలను పరిశీలించి రక్త హీనత బాధితులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించేవిధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్వైజర్ ను ఆదేశించారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

- అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి
- సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

పాలకొండలో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడిన నేపథ్యంలో దేశవ్యాప్త కార్మిక, కర్షక సంఘాలు చేపడుతున్న నిరసనలో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వైమన్మధరావు, కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందన్నారు. ఈ కోడ్‌లను అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరి సమస్యలపై నిరసన తెలుపుకొనే అవకాశం ఈ కోడ్ వల్ల కోల్పోతారని అన్నారు. ఇది ఒకరకంగా దేశంలో నిరంకుశ విధానాలను అవలంబించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఆ సమ్మె జయప్రదానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకర్రావు, బంగారు రాజేష్, గంట్రేటి గంగరాజు, బంగారు రవిలి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దుర్గ గుడి సెంటర్ వరకుకార్మికులు భారీ ర్యాలీ, మానవహారం చేపట్టి నిరసన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడు బండ్ల కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ తో కూడిన సమగ్ర చట్టం చేయాలన్నారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన పథకం, శానిటేషన్ వర్కర్స్, విఓఎ, విఆర్ఎ, ఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆప్కోస్‌ను కొనసాగించాలని, మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.కాంతారావు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.అమరవేణి, బి.పార్వతి, ఎ.దర్శమ్మి, ఆర్.భవాని, వై.మణి, మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం, స్కూల్ శానిటేషన్ నాయకులు ఎన్ రోయ్‌బారీ, బి.సునీత, పి.రమాదేవి, డి.చామంతి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, నాయకులు శారద, శాంతి, మహేశ్వరి, లక్ష్మి, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గేదెల సత్యం, శ్రీనివాసరావు, శ్రీ కోట దుర్గ మార్కెట్ కళాసీ యూనియన్ జాగా గోవిందరావు, డి గౌరీ శంకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిహెచ్ సంజీవి, భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు మజ్జి వీరమనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు ఖండాపు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని చూస్తున్నాయని, ఇందుకు నిరసనగా పోరాటాలు ఉధృతంగా నిర్వహించాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. కార్మికులకు నష్టం చేసే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు వైకుంఠం రామకృష్ణ, మున్సిపల్ యూనియన్ పర్మినెంట్ కార్మికుల సంఘం నాయకులు వెంకట్రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాముడు. శంకర్, మీడియా ఇన్చార్జ్ రవి, శ్రీను, మహిళా కమిటీ నాయకులు లక్ష్మి, గంగమ్మ, సీత పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

మక్కువ : కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరించే లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగాకనీస వేతనం కార్మికులకు అందజేయాలని, కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కనిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కృష్ణ, ఐద్వా నాయకులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: లేబర్ కోడ్లు రద్దు చేసి, అసంఘటితరంగ కార్మికులకి సమగ్ర చట్టం తేవాలని కోరుతూ జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, బోడియయ్య, రైతు సంఘం నాయకులు గౌరు నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, అప్పలనాయుడు భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు గౌరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థాని బస్టాండ్ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు దాలమ్మ, యు లక్ష్మి, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోయే నాలుగు లేబర్ కోడ్‌లను కార్మికులకు అడ్డుకోవాలని, లేకుంటే హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఆ సమ్మె జయప్రదానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఇందిర, సావిత్రి, రాంబాబు, భానుమూర్తి, సుబ్బయ్య, సత్యనారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వర అన్నారు రెడ్డి ఈశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జులై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి, రైతు సంఘం జిల్లా నాయకులు బి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిహెచ్ కృష్ణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు గౌరి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలు నశించాలని, జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్ ప్రసాదరావు ఆధ్వర్యంలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట. నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సాలూరులో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

మక్కువలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు,

బలిజిపేటలో నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

సీతానగరంలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

కొమరాడలో ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాసాపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్తర్లను వెరిఫికేషన్ చేసి వారి పేర్లను చదివారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత సమయంలో వేతనదారులు పనిచేయాలని, పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, పనులు చేసే ప్రదేశాల్లో టెంట్లు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ పద్మావతి

నవోదయం 2.0 పై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవోదయం టు జీరో కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ డి.పద్మావతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నాటు సారా నిర్మూలనకు కృషి జరగాలని, అలా జరిగితే మండలంలోని నాటు సారా రహిత మండలంగా తయారవుతుందని అన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, తద్వారా ఈ కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ ఎల్ఎన్ ప్రసాద్, తహశీల్దార్ జె.ప్రశాంత్‌కుమార్, డిటివి ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమార వర్మ, ఎఎస్ఐ లక్ష్మణరావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, ఎంపిపి రమణమ్మ, శ్రీరాములనాయుడుతో పాటు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ ఎం.రమణమ్మ

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎం.రవణమ్మ అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి గ్రామ సచివాలయం వద్ద ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీ, సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలకు దాహం తీర్చడానికి మజ్జిగా చలివేంద్రం ఎస్ సొసైటీ ఏర్పాటు చేయటం అభినందనీయన్నారు. వేసవి తీవ్రతలో శరీరంలో నీటి శాతం తక్కువ అవ్వకుండా తరచూ మంచి నీరు, మజ్జిగ తీసుకొని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాంటప్పుడే వడదెబ్బ నుండి గురికాకుండా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆరిక సునీత, మాజీ సర్పంచ్ పత్తిక మాసయ్య, పొడి మాజీ సర్పంచ్ రంగారావు, స్థానిక యువత, మహిళలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభిమానులకు స్వీట్ తినిపిస్తున్న సిఐ మురళీధర్

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదిన సందర్భంగా మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద నందమూరి సేవా సంఘం అధ్యక్షులు యడ్ల శ్రీను, కార్యదర్శి శెట్టి నారాయణ, బూర్లి వెంకటేష్, రౌతు చిన్న, మక్కువ కిషోర్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీయార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా అభిమానుల చేతుల మీదుగా కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ మురళీధర్ చేతుల మీదుగా కేక్ కటింగ్ జరిగింది. అనంతరం పట్టణ సీనియర్ టిడిపి నాయకులు బార్నాల సీతారాం, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, సీనియర్ అభిమానులు చెవిటి వెంకటరమణ, కోల మధు, పాకల సన్యాసిరావు చేతులమీదుగ 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముట్నూరు వెంకటరమణ, సుంకరి శ్రీను, బత్తిన మురళి, హనుమంతు రాము, రాగోలు దుర్గా ప్రసాద్, జైపాల్ శంకర్రావు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

వడదెబ్బకు గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి - మక్కువ

(పోలయ్య ఫైల్)

మండలంలోని కోన గ్రామానికి చెందిన వై.పోలయ్య (42) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. దబ్బగెడ్డ గ్రామ సమీపాన మేకల మందు వద్దకు వెళ్లి వస్తుండగా వడదెబ్బకు గురై మృతి చెందడంతో కుటుంబీకులు బోరును వినిపిస్తున్నారు. పోలయ్యకు భార్య పార్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. స్థానిక విఆర్ఒ తెలిపిన వివరాలు ప్రకారం కలెక్టర్‌కు సమాచారం అందజేసినట్లు తహశీల్దార్ షేక్ఇబ్రహీం తెలియజేశారు. ఇదిలా ఉండగా వైద్య సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించగా ఛాతి నొప్పితో మృతి చెందినట్లు తనకు సమాచారం ఇచ్చారని మక్కువ పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హరికృష్ణ తెలిపారు

160 లీటర్ల నాటు సారా పట్టివేత

ప్రజాశక్తి - వీరఘట్టం

అలమండ నుండి అక్రమంగా 160 లీటర్ల నాటు సారా కారులో తరలిస్తుండగా స్థానిక పాత బస్టాండ్ వద్ద మంగళవారం వేకువజామున పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.సూర్య కుమారి తెలిపారు. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కారు, సారా సీజ్ చేయడంతో పాటు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అవినీతి అనకొండ అలజంగి

బహిరంగ చర్చకు రావాలి : ఎమ్మెల్యే బోనెల

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అవినీతి అనకొండ అని, అలాంటి అవినీతిపరుడు నిజాయితీగా రాజకీయం చేస్తున్న తనపై తప్పుడు ప్రచారాలు చేయడం దెయ్యాలు వేదాలు వెల్లడించినట్లు ఉందని, ఈనెల 26లోగా అతని అవినీతిపై బహిరంగ చర్చకు రావాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర సవాల్ చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగారావు ఆధారరహితంగా తనపై తప్పుడు విమర్శలు చేశారని, దమ్మూ, ధైర్యం ఉంటే వాటిని రుజువు చేయాలని సవాల్ విసిరారు. బదిలీలకు డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపించిన ఆయన ఆధారాలుంటే చూపాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ చేయమన్నట్లు తహశీల్దారుపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆరోపిస్తున్న మాజీ ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులపై చేస్తున్న ఫిర్యాదులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అవినీతి అధికారులను బదిలీ చేయించడం తప్పా అని ప్రశ్నించారు. గతంలో రెవెన్యూ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి వందలాది పట్టాలు దోచుకున్న మాజీ ఎమ్మెల్యే నిజాయితీపరులు అవినీతిపరులుగానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. బడిదేవరకొండ మైనింగ్ విషయంపైనా తప్పుడు విమర్శలు చేస్తున్నారని, ప్రభుత్వం, న్యాయస్థానం ఇచ్చిన అనుమతుల్లో ఎమ్మెల్యే జోక్యం చేసుకోగలడానని ప్రశ్నించారు. ఆరోపణలను రుజువు చేస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు. వరద బాధితుల సహాయ నిధిని ముఖ్యమంత్రికి అందించలేదన్న ఆరోపణలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు దీనికి సంబంధించిన రసీదులను మీడియా ఎదుట ప్రదర్శించారు. వైసిపి చెందిన ఒక వ్యక్తి రూ.10 వేల చెక్కును ఇచ్చారని అది చెల్లకపోవడంతో వెనక్కి ఇచ్చేశామని గుర్తు చేశారు. చంద్రబాబును విమర్శించిన వ్యక్తి నుంచి డబ్బులు ఎలా తీసుకుంటామని ఆయన ప్రశ్నించారు. దీనిపై చెక్కు ఇచ్చిన వ్యక్తి స్పందించాలని అన్నారు. 2009 ఎన్నికల్లో కేవలం రూ.32 లక్షల ఆస్తిపాస్తులు మాత్రమే ఉన్నాయని అఫిడవిట్ ఇచ్చిన జోగారావు ఇప్పుడు రూ.300 కోట్లకు పైగా ఆస్తులు ఎలా కూడబెట్టారని నిలదీశారు. ఇటీవల రెండు కోట్లకు పైగా ఆదాయ పన్ను చెల్లించారని వివరించారు. తనపై ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవని అయితే జోగారావు చేసిన భూకబ్జాలకు, అక్రమాలకు పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని వెల్లడించారు. గతంలో బొత్స కుటుంబం కాళ్ల దగ్గర పడి ఉండే జోగారావు ఇప్పుడు చిన్న శ్రీను కాళ్ల పట్టుకుంటున్నారని ఆక్షేపించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాను అడ్డగోలుగా దోచుకున్న చిన్న శ్రీను, బొత్స కుటుంబాన్ని తెగపొగిడేస్తున్న జోగారావు అవినీతి దందా, అక్రమాల సామ్రాజ్యం ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. ఇకపై జోగారావు కబ్జాకాండను మరింతగా వెలికితీస్తానని, ఆధారాలతో సహా ప్రజల ముందు నిలబెడతానని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కృష్ణపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భవనిర్మాణ కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో భవనిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసి ఇప్పటికీ రూ.లక్షా17వేల కోట్లు సెస్ రూపంలో యజమానుల నుంచి, నిర్మాణ సంస్థల నుంచి వసూలు చేశాయని తెలిపారు. ఆ డబ్బులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టకుండా సుమారు రూ.70 వేల కోట్లు ఇతర ప్రభుత్వ అవసరాలకు బదలాయించారని విమర్శించారు. మన రాష్ట్రంలోనూ సుమారు రూ.570 కోట్లు ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిందన్నారు. దీనివల్ల భవనిర్మాణ కార్మికుల సంక్షేమానికి చేయాల్సిన కృషి రాష్ట్ర ప్రభుత్వం చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు ఇప్పటికే పని ప్రదేశాల్లో భవనిర్మాణ కార్మికులు అనేక ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని, మరికొంతమంది అంగవైకల్యం పొందుతున్నారని అన్నారు. వీరిని ఆదుకునేందుకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు. పనులు దొరకని సమయంలో ఇతర ప్రభుత్వ పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు, శంకర్రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

జంఝావతి సాధనకు ప్రతి ఒక్కరూ కదలాలి

- ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పిలుపు
- నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం వెరసి దశాబ్దాలుగా రైతులకు అందని ద్రాక్షలా ఊరిస్తున్న జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాధించుకుందామని, దీనికోసం ఏర్పాటు చేస్తున్న జంఝావతి సాధన సమితిలో పాల్గొనాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి బలగ శంకరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న స్థానిక ఎపి ఎన్జీవో హోంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తొలుత జంఝావతి సాధన సమితిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే జంఝావతి సాధన కోసం తమ సమితి పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇప్పుడు రైతులు, రైతు మిత్రులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు మేధావులు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా ప్రతినిధులతో జంఝావతి సాధన సమితి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దీనిద్వారా భవిష్యత్ కార్యాచరణ చేపట్టి జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాధిస్తామన్నారు. జంఝావతి ప్రాజెక్టు గూర్చి అడిగే నాథుడు లేకపోవడంతో రాజకీయ పార్టీలు ఎన్నికల హామీగా జంఝావతిని ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్రం, కేంద్రం ఒడిస్సా సానుకూల ప్రభుత్వాలు ఉండడంతో జంఝావతిని సాధించవచ్చన్నారు. దీనికి అన్ని వర్గాల సహాయ సహకారాలు సమితి అవసరమన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

జంఝావతి సాధన సమితిలో పాలుపంచుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. వివరాలకు 8555913959కు సంప్రదించాలన్నారు.

సంతృప్తికరమైన సేవలు అందించా

జిసిసి డిఎం మహేంద్ర కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సహకార సంస్థలో డివిజనల్ మేనేజర్‌గా, బ్రాంచ్ మేనేజర్‌గా పని చేయుడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, సంతృప్తికరమైన సేవలందించానని డిఎం మహేంద్ర కుమార్ చెప్పారు. బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నా డివిజన్ పరిధిలో గల పార్వతీపురం, సాలూరు, గుమ్మలక్ష్మీపురం బ్రాంచిల పరిధిలో గల 101 డిఆర్‌డిపోలు, డిఆర్ గోడౌన్లు, ఎంఎఫ్‌పి గోడౌన్లు, ఎంఎల్ఎస్ గోడౌన్లు, సూపర్ బజార్లు, గ్యాస్ డిపో, పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలు చూసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. అదేవిధంగా జిసిసి ఆర్‌అండ్‌డి ప్రొడక్ట్స్, మార్కెటింగ్, నిత్యావసర వస్తువుల అమ్మకాలు సకాలంలో జరపామని చెప్పారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతల్లో ఒకటైన ధాన్యం కొనుగోలు, గిరిజన రైతులకు సకాలంలో రుణాలు అందించడం, తిరిగి వాటిని వసూలు చేయడం, ఆర్ఎండి కౌంటర్ల ద్వారా జిసిసి ఉత్పత్తులను అమ్మకాలు చేయడం, మారుమూల గిరిజన ప్రాంత గిరిజనులకు ఇతర నిత్యవసర వస్తువులు అందించడంలో సత్ఫలితాలు సాధించామని చెప్పారు. అదేవిధంగా జిల్లా పరిధిలో ఉన్న అన్ని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, హాస్టళ్లకు, గురుకులాలకు ప్రతినెలా సరుకులు పంపిణీ చేయడంలో, ప్రభుత్వం పథకాలు గిరిజనులకు చేరవేయడంలో సంస్థ ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ ఏడాది సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అప్పగించిన లక్ష్యాలను చేరుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా ఇంత వరకు సుమారు రూ.6 కోట్లు టర్నోవర్ సాధించామని తెలిపారు. 2021లో రూ.47 కోట్లు సాధించగా, ఈ ఏడాది దాన్ని రూ.60 కోట్లు సాధించినట్లు తెలిపారు. జిసిసిలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల విషయంలో ప్రస్తుత సంస్థ చైర్మన్ శ్రవణ్ కుమార్ కుమార్, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి ఎంతో చిత్తశుద్ధితో ఉద్యోగోన్నతుల విషయంలో గొప్ప నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. సుమారు 31 మందికి ఉద్యోగోన్నతి కల్పించారని తెలిపారు. అందులో 17 మందికి జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ గా , 14 మందికి సీనియర్ సహాయకులుగా ఉన్న వారిని జూనియర్ మేనేజర్‌గా నియమించడం హర్షణీయమన్నారు. అధికారుల సమర్థతను బట్టి వివిధ విభాగాల్లో నియమించారని, ఎంతో పారదర్శకతతో జిసిసి యూనియన్, డివిజనల్ మేనేజర్లతో సంప్రదించి నియమకాలు చేపట్టారని చెప్పారు. బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి అపోహలకు తావులేదని చెప్పారు. కొత్తగా నియమితులైన జూనియర్ మేనేజర్లు, సీనియర్ అసిస్టెంట్లు సమర్థవంతంగా గిరిజనులకు సేవలందించి సంస్థకు మంచి పేరు తేవాలని మహేంద్ర కుమార్ కోరారు.

15 నుంచి డిఎజెజియుఎ పై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎజెజియుఎ) అవగాహన కార్యక్రమాలు జూన్ 15 నుంచి జూన్ 30 వరకు జరుగుతాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్‌మాన్), ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జుగా) కార్యక్రమాలను అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాలు లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. సాంప్రదాయ ప్రచారాల మాదిరిగా కాకుండా ఈ ప్రచారం గ్రామ స్థాయి / క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా హక్కులను క్షేత్రస్థాయిలో అందించేలా చూస్తుందని తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్ (పిఎం జెఎవై), కుల ధవీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి), పిఎం కిసాన్, జన్ ధన్ ఖాతా, బీమా కవరేజ్, సామాజిక భద్రత (వద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, దివ్యాంగ పెన్షన్), ఉపాధి, జీవనోపాధి పథకాలు, పిఎం విశ్వకర్మ, స్త్రీ, శిశు సంక్షేమం తదితరమైనవి అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ/ క్లస్టర్ స్థాయి ప్రయోజన సంతృప్త శిబిరాలు నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో ప్రచార కాలంలో తదితర కార్యకలాపాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆధార్, ఇకెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయన్నారు. జిల్లాకు సంబంధించిన సూక్ష్మ ప్రణాళికలు/ శిబిర క్యాలెండర్లు, పర్యవేక్షణ ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయడం, కవర్ చేసిన లబ్ధిదారుల వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. అట్టడుగు స్థాయిలో విజయాన్ని నిర్ధారించడానికి అన్ని లైన్ విభాగాలను కలుపుకుని జిల్లాలో ప్రచారం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ప్రచారం విజయవంతానికి సహకరించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జన్మాన్, ధర్తి ఆబా అభియాన్ కింద ఊహించిన విధంగా సమ్మిళిత, సాధికారత కలిగిన గిరిజన సమష్టి దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో ఈ ప్రచారం కీలకమైన అడుగు అని కలెక్టర్ అన్నారు. శిబిరాలను పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా రెడ్‌క్రాస్ సొసైటీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగుడబ మూడిళ్లు, ఉల్లిభద్రలో రెండిళ్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఆహుతవ్వడంతో బాధితులు నిర్వాసితులయ్యారు. దీంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం బాధితులకు టార్పన్లు, దుప్పట్లు, టవళ్లు, దోమతెరలు, చీరలు, నిత్యవసర వస్తువులు, హైజానిక్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ బిఎన్‌బి రావు, మాజీ జెడ్‌పి వైస్‌ఛైర్మన్ మరడాన తవిటి నాయుడు, మరడాన నారాయణస్వామి, మరడాన వెంకట నాయుడు, పెకేటి జనార్దన్ రావు (వైస్ సర్పంచ్), ఆనందరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు మంచిపల్లి పార్థసారథి, కోల సీతారాం (రిటైర్డ్ రైల్వే), మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ యమ్మల జనార్ధన రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యవస వస్తువులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి వితరణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు తన తండ్రి తెర్లి గౌరినాయుడు (డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్) 19వ వర్ధంతి సందర్భంగా ఉల్లిభద్ర, చినగుడబ అగ్నిప్రమాద బాధితులకు దుప్పట్లు, తువాళ్ళు, చీరలతో పాటు 5.కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ తండ్రి వృత్తిరీత్యా కుష్టు రోగులకు 25 ఏళ్లు సేవలందించారని, వృత్తిలో సేవా భావంలో ఆయన మాకెంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. సేవా భావంతో చేసే కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. అనంతరం అక్కడి గ్రామాల్లో ఆరోగ్య సర్వే వివరాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ ప్రధాన కార్య దర్శి అక్కేన శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా చెత్తాచెదారాలే!

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిస్థితి. ఎక్కడికక్కడ చెత్తాచెదారాలతో గ్రామం కంపు కొడుతుంది. ఈ పంచాయతీ పరిధిలో 15 వార్డులున్నాయి. 64 వీధుల్లో దాదాపుగా 14315 మంది నివాసం ఉంటున్నారు. దళిత వీధితో పాటు శైల, ఊజుల, గాజుల, మర్రి, తదితర వీధుల్లో ఉన్న కాలువలో చెత్తాచెదారాలు తొలగించ పోవడంతో ప్రజలు రోగాల బారిన పడి వేలాది రూపాయలు వెచ్చించి ఆరోగ్యాన్ని నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండల ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల అప్పుడప్పుడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఉక్కపోత భరించలేక పోతున్నామని, దీనికి తోడుగా దోమలు సైరవిహారం చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తాచెదారాలు తొలగిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగించకపోవడంతో చిన్నపాటి చినుకు పడ్డా వర్షం నీరంతా ఎక్కడికక్కడే నిలిచిపోయి మురికి నీరు రహదారిపై ప్రవహిస్తుంది. ఈ కారణంగా పాదచారులు, వాహన దారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమే మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా పరిశీలించి చెత్తాచెదారాల తొలగింపునకు చర్యలు తీసుకుంటానని వివరణ ఇచ్చారు.

శైలవీధిలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్త

ద్విచక్రవాహనం బోల్తా : యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఆడాలి -వెల్లం గూడ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో సీతంపేట గ్రామానికి చెందిన గిరిజాల వేణుమాధవ్ (22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సీతంపేటకు చెందిన గిరిజాల వేణుమాధవ్, చిన్నాన్న కుమారులు గిరిజాల మనోజ్ కుమార్, గిరిజాల హర్షిత్ మంగళవారం ఆడాలి యు పాయింట్ సందర్శించి తిరిగి వస్తున్నారు. ఆడలి వేల్లం గూడ సమీపంలో బైకు అదుపుతప్పి రక్షణ గోడ గోతిలో బోల్తా పడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించే అనంతరం శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వేణుమాధవ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హర్షిత్, మనోజ్ కుమార్ చికిత్స పొందుతున్నారు. వేణుమాధవ్ మృతి చెందినప్పటికీ తన కళ్ళ మరొకరికి వెలుగు చూపులని తన నేత్రాలు దానం చేశారు. మృతుడు తండ్రి శంకరరావు ఆర్టీసీ డ్రైవర్, తల్లి గంగమ్మ గృహిణి. ఒకగానొక్క కొడుకు బిటెక్ చదివి చేతికి అందికొచ్చిన సమయంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఉదయం నుంచి సరదాగా కనిపించిన కుమారుడు ఒకసారి మరణ వార్త వినగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై వై.అమ్మనరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

మృతుడి నేత్రాలు దానం



డెత్‌స్పాట్ అడలి వ్యూ రోడ్డు

అడలి - వెల్లంగూడ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు పోలీసులు అవగాహన కల్పించినా ఎప్పటికప్పుడు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదే మార్గం ఇప్పటి వరకూ ముగ్గురు ప్రమాదాల బారినపడి మృతి చెందారు. గతేడాది నవంబర్‌లో పాలకొండ పట్టణం ఇంద్రనగర్ కాలనీ చెందిన దుప్పాడ భారతి కుటుంబంతో అడలి వ్యూ పాయింట్ సందర్శించి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం బోల్తాపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే శ్రీకాకుళం జిల్లా బూర్జి మండలం చెందిన సుమారు 15 మందితో ఆటో అదుపుతప్పి బోల్తా పడి వడ్డి యశోద మృతి చెందారు. మిగతా వారికి గాయాలయ్యాయి. సంఘటనను చూస్తున్న వెల్లంగూడకు చెందిన గిరిజనుడ్ని అదే సమయంలో వీరఘట్టం చెందిన ఆటో ఢీకొనడంతో అతడు మృత్యువాతపడ్డాడు.

ఫైడే సినిమాను ఆదరించండి

అమ్మలోని అమృతత్వాన్ని ఆవిష్కరించే చిత్రం : కథానాయిక దియారాజ్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

అమ్మలోని అమతత్వాన్ని ఆవిష్కరించి న అద్భుత చిత్రం 'ఫైడే'అని ఆ సినిమా కథానాయిక దియారాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని జిఎస్ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు చెందిన తనను తెలుగు చిత్రసీమ ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రతిభవున్న వారు ఎందరో ఉన్నారన్నారని, కానీ అందరికీ అవకాశాలు రావడం లేదన్నారు. నిర్మాత కేశనకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రేక్షకులకు సందేశాన్ని కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలనే సంకల్పంతో అమ్మలోని అమృతత్వాన్ని ఆవిష్కరిస్తూ 'ఫైడే' చిత్రాన్ని నిర్మించామన్నారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి ప్రోత్సహించాలని కోరారు. దర్శకుడు ఈశ్వర్ ధూళిపూడి మాట్లాడుతూ ఫైడేచిత్రం అమ్మ సెంటిమెంటుతో ముడిపడి వుందన్నారు. ప్రతిబిడ్డ తల్లిగర్భంలో వున్నపుడే మనకు తెలియకుండా ఎన్నో విషయాలు నేర్చుకుంటాడని,. అలా సుభద్ర గర్భంలో ఉన్నపుడే అభిమన్యుడు పద్మవ్యూహం గురించి తెలుసుకుని వీరుడయ్యాడని అన్నారు. వైవిధ్యంతో రూపొందించిన ఈ చిత్రానికి రాజ్మరియన్ కథ, మాటలు, స్క్రీన్ప్లే సమకూర్చా రన్నారు. ప్రధానపాత్రలో అమ్మగా నటించిన హీరోయిన్ దియారాజ్ ప్రేక్షకుల మనసులను ఆకట్టుకునేలా నటించారన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కథానాయిక దియారాజ్